శివలింగానికి జలాభిషేకం నిర్వహించేంకలషాలతో వస్తున్న భక్తులు

ఘనంగా సంగమేశ్వర ఆలయ వార్షికోత్సవం

కోహీర్, డిసెంబర్ 5: మండలంలోని కవేలి గిరిజా సమేత మహాలింగ సంగమేశ్వరాలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆలయంలోని శివలింగానికి 108కలశాలతో అభిషేకం నిర్వహించారు. రెండు కిలోమీటుర్ల దూరం ఉన్న ఆలయానికి పాదయాత్రగా చేరుకున్నారు. ఈ సందర్భంగా పుణ్యాహవాచనం, గణపతి పూజ, గౌరీ పూజ, శిఖర పూజ, ధ్వజారోహనం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. వేడుకల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు రాములు, మాజీ సర్పంచ్‌లు యాదవరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు మల్లమ్మ, శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు మాణయ్య, రాజు ఉన్నారు.

చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలి

హత్నూర, డిసెంబర్ 5: చిన్నారులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని హత్నూర ఎంపీడీవో శంకర్ సూచించారు. మండల కేంద్రమైన హత్నూరలో ప్రజాపాలనలో భాగంగా గురువారం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేశ్, అంగన్‌వాడీ టీచర్ పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న నర్సింహులు

కోహీర్, డిసెంబర్ 5: కోహీర్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల అటెండర్ లలిత బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం తెలంగాణ పంచాయతీ రాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు యాదవ్, ప్రధాన కార్యదర్శి రాహుల్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సుమలత ఉన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నిజాంపేట్, డిసెంబర్ 5: మండల పరిధిలోని బల్కంచెల్క పంచాయతీ తండాకు చెందిన తాజా మాజీ ఉపసర్పంచ్ లక్ష్మణ్ నాయక్ గురువారం మరణించడంతో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అక్కడకు వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంసింగ్, మాజీ వైస్ ఎంపీపీ అంజిరెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు దుర్గారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంగారెడ్డి, మాజీ సర్పంచ్ సంగయ్య, నాయకులు రూప్‌సింగ్, శంకర్, రాములు, వసంత్, దీవీసింగ్ ఉన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 5: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి హైదరాబాద్‌లో జరిగే అండర్-14 అంతర్‌జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు ఉమ్మడి మెదక్ జిల్లా జట్టును ఈ నెల 7న ఉదయం 10 గంటలకు ఎంపిక చేయనున్నట్టు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యధర్శి రాజేందర్ రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డిలోని జూబ్లీ క్లబ్ ప్రాంగణంలో ఉన్న ఎంఎస్ అకాడమీలో ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. క్రీడాకారులు 2010 సెప్టెంబర్ 1 నుంచి 2012 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఆసక్తిగల క్రికెట్ క్రీడాకారులు తమ ఒరిజినల్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

చెక్కులు పంపిణీ

నిజాంపేట్, డిసెంబర్ 5: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన నిజాంపేట్ గ్రామానికి చెందిన తొమ్మిది మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగజ్యోతి, ఆర్ఐ జాన్సన్, మాజీ ఎంపీటీసీ సబితాలింగారెడ్డి, రాధాకిషన్ సేట్, వినోద్‌పాటిల్, జల శంకర్, చుండురి సప్తగిరి ఉన్నారు.

పటాన్‌చెరు: బీఆర్ఎస్ కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, కార్యకర్తలు, నాయకులను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

రామచంద్రాపురం: పోలీస్‌స్టేషన్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావుతో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత ఆదర్శ్‌రెడ్డి, తదితరులు

రామచంద్రాపురం: కొల్లూర్ పోలీస్‌స్టేషన్‌లో కార్పొరేటర్ మెట్టుకుమార్, బీఆర్ఎస్ నేతలు సోమిరెడ్డి, తదితరులు

హరీశ్‌రావు అరెస్ట్‌పై భగ్గుమన్న బీఆర్ఎస్

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అరెస్ట్‌ను నిరసిస్తూ గురువారం బీఆర్ఎస్, బీఆర్ఎస్‌వీ నాయకులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. పోలీస్‌స్టేషన్ల ఎదుట బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. పలు చోట్ల రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరనస తెలుపుతున్న నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మాజీ మంత్రి హరీశ్‌రావుపై తప్పుడు కేసులు బనాయించి సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం బిగజారుడు రాజకీయాలు చేస్తున్నదని మండిపడ్డారు. వచ్చే అసెంబ్లీ సమావేశాలకు హరీశ్‌రావు హాజరు కాకుండా అక్రమ అరెస్ట్‌లు చేస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని, ఇది ప్రజాస్వామ్యంలో ఏమాత్రం మంచిది కాదని, బేషరతుగా హరీశ్‌రావును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, డిసెంబర్ 5

సంగారెడ్డి కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

బొల్లారం: గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ బయట నిరసన తెలుపుతున్న మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి

జహీరాబాద్: మాట్లాడుతున్న మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్

కోహీర్: బీఆర్ఎస్ నాయకులను గచ్చిబౌలి నుంచి శామీర్‌పేటకు తరలిస్తున్న పోలీసులు



రాయికోడ్: మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి నాజీమ్‌పటేల్, తదితరులు

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు టీపీటీఎఫ్ మద్దతు

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 5: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు టీపీటీఎఫ్ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్, అనుముల రాంచందర్‌లు గురువారం ప్రకటించారు. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న రిలే నిరసన దీక్షలు, ఈ నెల 9 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెకు మద్దతు తెలుపుతున్నట్టు వెల్లడించారు. సమగ్ర శిక్షా అభియాన్‌లో ఉద్యోగులకు కనీస వేతన చట్టం అమలు కావడం లేదని, వెట్టి చాకిరి విధానం అమలవుతున్నదని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షా అభియాన్‌లో 19,360 మంది ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు. వారందరూ ఏళ్ల తరబడి పనిచేస్తున్నా కనీస వేతనాలు కూడా అమలు కావడం లేదని ఆరోపించారు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో వారిలో ఆందోళన నెలకొన్నదన్నారు. సమ్మె విజయవంతం చేసేందుకు టీపీటీఎఫ్ శ్రేణులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నేడు జిల్లా కమిటీ సమావేశం

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు శాంతినగర్‌లోని ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్, అనుముల రాంచందర్ పేర్కొన్నారు. జిల్లా కమిటీ సమావేశానికి రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ఉప కమిటీల కన్వీనర్లు సకాలంలో హాజరు కావాలని కోరారు.

పదిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

మునిపల్లి, డిసెంబర్ 5: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేవిధంగా కృషి చేయాలని సంగారెడ్డి విద్యాధికారి వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులకు ఆదేశించారు. గురువారం మండలంలోని అంతరం జిల్లా పరిషత్ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. పదిలో మంచి ఫలితాలు సాధించి ప్రభుత్వ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

రాయికోడ్, డిసెంబర్ 5: పదో తరగతి పరీక్షలో ప్రతి విద్యార్థి పాస్ అయ్యేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం రాయికోడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాల, ఆదర్శ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ఈ ఏడాది జిల్లాలో 22 వేల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తారని, వీరికి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. గతేడాది జిల్లా పదో తరగతి ఫలితాల్లో ఐదో స్థానంలో ఉందని, ఇప్పుడు మొదటి స్థానంలో నిలిచేలా ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి చేయాలని కోరారు. మండల విద్యాధికారి అంజయ్య, ప్రధానోపాధ్యాయులు పాపారావు, దీపిక తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

నల్తూరులో మైనింగ్ అధికారుల పర్యటన

బొల్లారం, డిసెంబర్ 5: గ్రామంలో క్రషర్ల ఏర్పాటు అనుమతులను రద్దు చేయాలంటూ ఇటీవల నల్తూరు గ్రామస్తులు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులకు వినతిపత్రాలు అందజేసిన విషయం తెలిసిందే. గురువారం ఈ మేరకు జిల్లా మైనింగ్ శాఖ ఏడీ మధుసూదన్ రెడ్డి నల్తూరు గ్రామంలోని సర్వే నంబర్ 160లో స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి పర్యటించారు. అధికారులకు మరోమారు గ్రామంలో క్రషర్ ఏర్పాటు వద్దని, క్రషర్ లైసెన్స్ అనుమతులను తక్షణమే రద్దు చేయాలని కోరారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఇటాచి పనులను వెంటనే నిలిపివేయాలని యాజమాన్యాలను ఆదేశించారు. తాజా పరిస్థితులపై గ్రామస్తులు వెలిబుచ్చిన అభిప్రాయాలను కలెక్టర్‌కు నివేదిక రూపంలో అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి, ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ, ఎస్సై నాగలక్ష్మి, మాజీ సర్పంచ్ జనార్దన్, నాయకులు రాజేశ్, భీమ్‌రావు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రషర్ యాజమాన్యాలతో మాట్లాడుతున్న మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు

ముగిసిన వాలీబాల్ క్రీడాపోటీలు

వాలీబాల్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టుతో నిర్వాహకులు

చౌటకూర్, డిసెంబర్ 5: మండలంలోని సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న వాలీబాల్ పోటీలు గురువారం ముగిశాయి. కళాశాలలో విద్యనభ్యసిస్తూ అకాల మరణం చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి రాజ్‌కుమార్‌నాయక్ జ్ఞాపకార్థం గడిచిన నాలుగు రోజులుగా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మడుపతి త్రిశూల్ పర్యవేక్షణలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కళాశాలలోని ఈసీఈ, సీఎస్ఈ, సివిల్, మెకానికల్ విభాగాలకు చెందిన విద్యార్థుల జట్లు పాల్గొన్నాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించిన ఈ రోట్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి మెకానికల్ విభాగం జట్టు, రెండో బహుమతి సివిల్ విభాగం జట్లు గెలుపొందాయి. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

గేటు దాటుతున్న కాలుష్యం

బొల్లారం, డిసెంబర్ 5: ఓ పరిశ్రమ తన ప్రధాన గేటు నుంచి రసాయన వ్యర్థ జలాలను రోడ్డుపైకి విడుదల చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని బెనోవా పరిశ్రమ వ్యవహార తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. ఇటీవల వాతావరణ పరిస్థితులను ఆసరాగా చేసుకొని యాజమాన్యం యథేచ్ఛగా పరిశ్రమ ప్రధాన గేటు ముందు భాగం నుంచి రోడ్డుపైకి రసాయన వ్యర్థ జలాలను విడుదల చేస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డు మీదకు వచ్చిన జలాలతో విపరీతమైన వాయు, నీటి కాలుష్యంతోపాటు ఘటైనా వాసనలను తట్టుకోలేకపోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికే పలు పరిశ్రమలకు పీసీబీ అధికారులు భారీ జరిమానాలు విధించినా ఎలాంటి మార్పు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పీసీబీ అధికారులు పరిశ్రమను తనిఖీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని పారిశ్రామిక వాడ ప్రజలు కోరుతున్నారు.

బెనోవా పరిశ్రమ గేటు నుంచి బయటకు వస్తున్న రసాయన వ్యర్థ జలాలు

భూసార పరీక్షలతో మేలైన దిగుబడి

జహీరాబాద్: భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సరిత

జహీరాబాద్, డిసెంబర్ 5: భూసార పరీక్షలతో మేలైన దిగుబడి సాధ్యమవుతుందని ఏఐసీఆర్‌పీ డాట్ సంగారెడ్డి జిల్లా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సరిత, జహీరాబాద్ డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్ అన్నారు. ప్రపంచ మట్టి దినోత్సవాన్ని పురస్కరించుకొని జహీరాబాద్ మండలంలోని రంజోల్, న్యాల్‌కల్ మండలంలోని మెటట్ కుంట రైతు వేదికలతోపాటు జహీరాబాద్, న్యాల్‌కల్, మొగుడంపల్లి మండలాల్లోని రైతు వేదికల్లో సంబంధిత అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. మట్టి పరీక్షతో కలిగే లాభాల గురించి వివరించారు. కార్యక్రమంలో డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ స్వామి, స్నేహలత, శైలజ, కైలాష్, ఆయా మండలాలకు చెందిన వ్యవసాయాధికారులు లావణ్య, అవినాష్‌వర్మ, అస్నోద్దీన్, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

భుసార పరీక్షలపై అవగాహన

నిజాంపేట్, డిసెంబర్ 5: ప్రపంచ మృత్తికా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిజాంపేట్ మండల కేంద్రంలో పలు గ్రామాల రైతులకు మృత్తిక పరిరక్షణ గురించి ఏడీఏ నూతన్ కుమార్, ఏవో ఆసియా, ఏఈవో వంశీకృష్ణ సేంద్రియ ఎరువులు, భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు.

హత్నూరలో..

హత్నూర, డిసెంబర్ 5: రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించి సాగులో లాభాలు ఆర్జించాలని వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రావు సూచించారు. గురువారం మండలంలోని చింతల్‌చెరు, హత్నూర, కాసాల రైతువేదికల్లో ప్రపంచ మృత్తికా దినోత్సవం నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పుడూ ఒకేరకమైన పంట సాగుచేయకుండా పంటమార్పిడి చేయాలని సూచించారు. భూసార పరీక్షలుచేసి దానికి అనుగునంగా సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

జహీరాబాద్, డిసెంబర్ 5: నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలంలోని పోలింగ్ కేంద్రాలను జహీరాబాద్ డివిజన్ పంచాయతీ అధికారి అమృత తనిఖీ చేశారు. గురువారం మండలంలోని రాయిపల్లి తండా, పర్యతాపూర్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, ఓటర్లు, ఎన్నికల అధికారులకు అవసరమైన మౌలిక వసతులపై ఆరా తీశారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, ఇతర సదుపాయాలను పరిశీలించారు. వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు కేంద్రాలకు వచ్చేందుకు అనుకూలంగా ఉన్నారా..? లేదా అనే విషయాలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సంజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సంగయ్యస్వామి పాల్గొన్నారు.

రాయిపల్లి తండాలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

హస్తకళ లపై అవగాహన

గుమ్మడిదల, డిసెంబర్ 5: మండలంలోని వీరన్నగూడెంలో చెక్కబొమ్మలతో వివిధ రకాల బొమ్మలను తయారు చేయడంలో హస్తకళాకారుల ప్రతిభ అద్భుతమని రాష్ట్ర హస్తకళాకారుల మేనేజర్ మసూద్, మండల విద్యాధికారి రాంబాబు అన్నారు. గురువారం వీరన్నగూడెంలోని హస్తకళల భవనాన్ని బొంతపల్లి పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ఈసందర్భంగా చెక్క బొమ్మలను తయారు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి చెక్కబొమ్మలను బహుమతులుగా అందజేశారు. దివ్యాంగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింలు, ఉపాధ్యాయులు సంపత్, విశ్వనాథ్, ప్రసాద్ పాల్గొన్నారు.

పేటలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం

కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న నాయకులు

సదాశివపేట, డిసెంబర్ 5: సదాశివపేట బస్టాండ్ ఎదుట ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ఏర్పాటుకు గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతా సాయినాథ్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు చింతా ఆనంద్, చిల్వరి రవి, పద్మశాలి సంఘం పెద్దలు అంబటి విశ్వనాథం, అడ్డగట్ల మనోహర్, కోట రవీందర్, మధునాల నర్సింలు, మేకల జనార్దన్, గోనె శంకర్, కృష్ణ, సిద్దిరాములు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళ ల ఆర్థిక స్వావలంబనకు కృషి

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 5: మహిళ ల ఆర్థిక స్వావలంబనకు కృషి చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో ఇందిరా క్రాంతి పథకం, మహిళా శక్తిలో భాగంగా మంత్రి క్యాంటీన్‌ను ప్రారంభించారు. రూ.650.20 కోట్ల విలువైన బ్యాంకు లింకేజీ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా అందోల్

అందోల్, డిసెంబర్ 5: అందోల్‌లో మరిన్ని ఉన్నత స్థాయి విద్యా సంస్థలను ఏర్పాటు చేసి ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం అందోల్‌లో నూతనంగా నిర్మిస్తున్న 150 పడకల దవఖానతోపాటు నర్సింగ్ కళాశాల భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. మంత్రి కార్యక్రమం కవరేజ్‌కి వచ్చిన కొంతమంది విలేకర్లను పోలీసుల అడ్డుకుని భయటకు పంపించడంతో పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీ సురేశ్ షెట్కార్, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఆర్డీవో పాండు, మున్సిపల్ కమిషనర్ తిరుపతి, తహసీల్దార్ విష్ణుసాగర్ పాల్గొన్నారు.

మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర, కలెక్టర్ వల్లూరు క్రాంతి